గిర్మాపూర్‌లో ఘనంగా బీరప్ప కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో బీరప్ప కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, గొల్ల కురుమలు పాల్గొని శాస్త్రోక్తంగా బీరప్ప కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో పందిళ్లు వేసి ఆలయంలో మూలవిరాట్ వద్ద ఉత్సవాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎన్నికల సీజన్ కావడంతో అన్ని పార్టీల నాయకులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణంలో గిర్మాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు బాలప్ప, ఆనంద్, బీజేపీ నాయకులు ఆంజనేయులు, హన్మంత్ రెడ్డి, రాఘవరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులు బీరప్పను దర్శించుకున్నారు.

అక్రమ లేవుట్‌పై ఫిర్యాదు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 112, 113లలోని గ్రామానికి వెళ్లే రోడ్డు భూమిని ఆక్రమించుకుని అక్రమ లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు మాజీ వార్డు సభ్యుడు సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు లేఅవుట్‌పై మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు, డీపీఓకు ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 112, 113లలో గ్రామ పంచాయతీ, హెచ్‌ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రామానికి వెళ్లే దారిని ఆక్రమించి లేఅవుట్ చేసి ప్లాట్లు అమ్ముతున్నారని వివరించారు. గ్రామస్తులు అడ్డుకుంటే బెదిరిస్తున్నారని అన్నారు. గ్రామానికి వెళ్లేందుకు ఏళ్లుగా రోడ్డు ఉండగా దాన్ని పూర్తిగా ఆక్రమించుకుని ప్లాట్లు చేశారన్నారు. లే అవుట్‌లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా నిలిపివేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా అధికారులను కోరారు.

నర్సింహారెడ్డి కళాశాలలో మెడికల్ క్యాంప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని వారికి వైద్య సిబ్బంది పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ సృజన, జాతీయ బీమా సంస్థ ప్రతినిధి రమేశ్ సదానందన్ మాట్లాడుతూ ఆరోగ్యం అంటే శారీరకంగా దృఢంగా ఉండటమే కాకుండా మానసికంగా స్థైర్యం కలిగి ఉండాలని, అప్పుడే మనిషి పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లని తెలిపారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన సోమవారం స్వామివారి సన్నిధిలో విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు. దేవాలయం వద్ద గల యాగశాలలో మహా పూర్ణాహుతి, అనంతరం గర్భాలయంలో కొలువైన స్వామివారికి పంచామృతాలు, వివిధ రకాల జలాలతో అభిషేకాలను నిర్వహించారు. యాదాద్రి ప్రధానార్చకులు నల్లందిగులు నృసింహార్యులు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఇందిరా దంపతుల చేతులమీదుగా నిర్వహించారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ రాష్ట్ర నేత నక్కా ప్రభాకర్‌గౌడ్, ఎంపీపీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మేడ్చల్‌లో పోలీసుల కవాతు

మేడ్చల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ పట్టణంలో సోమవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి ఫ్లాగ్ మార్చ్ ప్రారంభించిన పోలీసు సిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధులు, పలు కాలనీల్లో కవాతు నిర్వహించారు. మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ సీఐ సత్యనారాయణ, సూరారం, దుండిగల్ సీఐలు వెంకటేశం, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంలాంటిది

జవహర్‌నగర్: సమాజంలో ఓటు వజ్రాయుధంలాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్‌ఐ అనిల్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి



రూప్‌సింగ్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైదోనిగడ్డ తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ వివరాల ప్రకారం సైదోనిగడ్డ తండాకు చెందిన బానోత్ రూప్‌సింగ్(50) సోమవారం ఉదయం భార్య బానోత్ చండీబాయితో కలిసి సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం రూప్‌సింగ్ నీటిలో గాలం వేయగా భార్య కొంత దూరంలో ఉంది. చేపలు పట్టే క్రమంలో అతడు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. వెంటనే భార్య అతడి వద్దకు చేరుకునేలోపే నీటిలో మునిగిపోవడంతో స్థానికులకు సమాచారం ఇచ్చింది. స్థానికులు వాగు వద్దకు చేరుకుని గాలింపు చేపట్టగా అప్పటికే మరణించాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

శ్రామికుల ఓట్లే కీలకం

మల్కాజిగిరిలో అభ్యర్థుల గెలుపు, ఓటములపై చూపనున్న ప్రభావం

- వేలల్లో పరిశ్రమలు.. అన్ని రాష్ట్రాల నుంచి వలస ఉద్యోగులు, కార్మికులు
- మొత్తం శ్రామికుల సంఖ్య 9,57,853, ఇందులో వలసలు 1,57,326
- భిన్న భాషలు, సంస్కృతులు
- పార్టీ అభ్యర్థులకు అంతు చిక్కని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం



సాక్షి, మేడ్చల్ జిల్లా: వేలల్లో పరిశ్రమలు.. దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాలకు చెందిన కార్మిక కుటుంబాలతో సందడి.. అన్ని భాషలు, సంస్కృతులు ఇక్కడ కనిపిస్తాయి. ఇలా మినీ ఇండియాగా పేరుగాంచింది. దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్‌ల్లో ఇది స్పష్టమవుతోంది. దేశంలోనే భిన్నమైన లోక్‌సభ నియోజకవర్గంగా మల్కాజిగిరికి పేరుంది. ఇక్కడి రాజకీయ నేతలకు ఇదో సవాల్‌గానే నిలుస్తోంది. ఒక్కసారి పట్టు సాధిస్తే దాన్ని నిలుపుకొనేందుకు ఎన్నో రకాలుగా యత్నించాల్సిందే. ఓ వైపు పరిశ్రమలతో పాటు సాఫ్ట్‌వేర్, వ్యాపారాలు, నిర్మాణ రంగానికి కేంద్రంగా మారింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం తరలివచ్చిన సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులతో జనసంద్రంగా మల్కాజిగిరి నియోజకవర్గం కనిపిస్తోంది. పరిశ్రమలకు కేంద్రంగా విరాజిల్లుతున్న మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో కొత్త పరిశ్రమలు, ఐటీ రంగాలకు అవకాశాలను కల్పిస్తోంది. ఇప్పటికే పలు ప్రధాన పార్టీలు కొంతకాలంగా పట్టుసాధించేందుకు ముందుకు సాగుతున్నాయి.

గెలుపు, ఓటములపై శ్రామికుల ఓట్లే కీలకం

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు, ఓటములపై శ్రామికుల(వలస కార్మికుల) ఓటర్ల ప్రభావం చూపనున్నాయి. శ్రామికుల ఖిల్లాగా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని జనాభాలో 40 శాతం మంది శ్రామికులే ఉన్నారు. ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శ్రామికులు, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పని చేసే అసంఘటిత, సంఘటిత కార్మిక కుటుంబాలు అధికంగా జీవిస్తున్నాయి.

పారిశ్రామిక వాడలిక్కడే..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ఇంజినీరింగ్, ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీలు ఉన్నాయి. మౌలాలి ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్, స్టీల్, ప్లాస్టిక్ ఫర్నీచర్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడున్న కోకాకోలా కంపెనీల్లో కూడా కార్మికులు, ఉద్యోగులు జీవనోపాధి పొందుతున్నారు. బాలానగర్ పారిశ్రామిక వాడ పరిధిలో ఫ్యాన్లు తయారు చేసే కంపెనీలు, ఆటోమొబైల్ వస్తువుల తయారీ, బీర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, ఫాబ్రికేషన్, వైర్ మెష్ యూనిట్లు, ఫుడ్ ప్రొడక్ట్స్, ఫార్మా యూనిట్లు తదితర కంపెనీలు ఉన్నాయి. బీహెచ్‌ఈఎల్, ఆర్‌అండ్‌డీ, హెచ్‌ఏఎల్, ఐడీపీఎల్ (ప్రస్తుతం ఖాయిలా పడిన పరిశ్రమ) ఎస్‌ఆర్‌ఎస్‌పీ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐడీఏ బాలానగర్, ఐడీఏ కూకట్‌పల్లి, సీఐఈ గాంధీనగర్ ఒకే చోట ఉన్నాయి. శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లో బయోటెక్, కెమికల్, విత్తన చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. గుండ్లపోచంపల్లిలో అపరెల్ టెక్స్‌టైల్ పార్కు ఉంది. తుర్కపల్లిలో ఐసీఐసీఐ నాలేడ్జ్ కంపెనీ పేరుతో పరిశ్రమల హబ్ ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్, కీసరలో కూడా చిన్న కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో వందలాది మంది పని చేస్తున్నారు.



ఐదు అసెంబ్లీ నియోజకర్గాల పరిధిలో..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకర్గాల పరిధిలో మొత్తం శ్రామికులు 9,57,853 మంది ఉండగా, వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన శ్రామికులు 1,57,326 మంది ఉన్నారు. అలాగే, 12,774 భారీ, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమల్లో 2,33,088 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో తాజాగా జిల్లాలో 2023–24 సంవత్సరంలో కొత్తగా ఏర్పడిన 1,763 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో 10,758 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరంతా నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్నారు. అలాగే, కుటీర పరిశ్రమలు, నిర్మాణ రంగాల్లో వేలాదిగా పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మిక కుటుంబాలు కూడా వేలల్లో ఇక్కడే ఉంటున్నారు. నూతన పారిశ్రామిక విధానాల్లో భాగంగా మరో 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో

వివిధ ప్రాంతాల నుంచి..

పరిశ్రమల్లో పని చేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు భారీగా తరలివచ్చారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్న కుటుంబాలు వేలల్లోనే ఉంటాయి. ఇక నిత్యం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి వేలాది మంది ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నియోజకవర్గంలోని చాలాచోట్ల కొత్త కాలనీలు సైతం ఏర్పడ్డాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఇక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో వందలాదిగా ఆధునిక వసతులు కలిగిన విల్లాలను నిర్మించారు.



ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే, కుటీర పరిశ్రమలు, నిర్మాణ రంగాల్లో వేలాదిగా పని చేసే సంఘటిత, అసంఘటిత కార్మిక కుటుంబాలు వందలాదిగా ఇక్కడే ఉంటాయి. నూతన పారిశ్రామిక విధానాల్లో భాగంగా జిల్లాలో మరో 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి. వీరంతా ఇక్కడే జీవనాన్ని సాగిస్తుండటంతో పాటు ఓటు కలిగి ఉన్నారు. వీరి ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములు ఆధారపడి ఉన్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.

కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2050

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌకర్యార్థం ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కు ఫోన్ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపు, ఇతర ప్రలోభాలకు గురిచేస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న కురపాటి నాగేశ్వరరావు

కీసర: మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం ముఖ్య సలహాదారుగా నాగారం మున్సిపల్‌కు చెందిన కురపాటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు చిట్టిమెళ్ల గణేష్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. పదవీ బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు చిట్టిమెళ్ల గణేష్, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

నారపల్లిలో దొంగల బెడద

పోచారం: నారపల్లిలోని పలు కాలనీల్లో చిన్నాచితక దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇళ్ల వద్ద ఏ చిన్న వస్తువు కనిపించినా వదలకుండా ఎత్తుకెళ్లి పోతున్నారు. నూతన భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతంలో ఇనుము, సెంట్రింగ్ డబ్బాలు, వాటర్ పైపులు, సర్వీస్ వైర్లు, బల్బులు వంటి వస్తువులను దొంగిలించుకుపోతున్నారు. రాత్రి వేళ బోరు మోటార్లు, వాటికి వినియోగించే సర్వీస్ వైర్లను తస్కరిస్తున్నారు. చిన్నా చితక దొంగతనాలు కావడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు కొందరు ఆసక్తి చూపడంలేదు. దీంతో దొంగతనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈటల గెలుపు ఖాయం

శామీర్‌పేట్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల గెలుపు ఖాయమని జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ స్థానికంగా ఉంటూ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ప్రజలంతా ఈటల వైపే ఉన్నారన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్ మండలం కాచవానిసింగారంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం చేశారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, కేంద్రం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు వివరించారు. ఈటల గెలుపునకు బీజేపీ గుర్తు కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని ఎంపీపీ ప్రజలను కోరారు.



ఈటలను గెలిపించాలని కాచవానిసింగారంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రచారం



కొల్తూర్‌లో బీజేపీ కార్యకర్తల ర్యాలీ

మల్కాజిగిరిలో గెలుపు ఈటలదే..



కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో సోమవారం నిర్వహించిన బీజేపీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాగారం బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, నక్క కిషోర్, రాకేష్, జంగారెడ్డి, అక్కాల సురేష్, సూర్యశేఖర్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్, సత్యనారాయణ, ఆంజనేయులు, మహేందర్‌యాదవ్, చనింగని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

కీసర: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులతో పాటు ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పెద్దఎత్తున వివిధ పార్టీలకు చెందిన నేతలు, కాంగ్రెస్‌లో చేరుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. నాగారం మున్సిపల్ రాంపల్లికి చెందిన కాంగ్రెస్ నేత పంబాల రమేష్ ఆధ్వర్యంలో 1, 2, 3, 4, వార్డులతో పాటు రాంపల్లికి చెందిన కురుమ సంఘం నేతలు సుమారు 100 మంది సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. నాగారం పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, మాజీ సర్పంచ్ అరిగే రాములు, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ముప్ప రామారావు అన్నారు. నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కందాడి శివరాం రెడ్డి, నేతుల బలిదే రమేష్‌గుప్తా, జంగయ్య యాదవ్, రాయిల శ్రావన్‌కుమార్‌గుప్తా, జూపల్లి రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగెస్ మండల అధ్యక్షుడు రాజేశ్‌తో కలిసి గడపగడపకూ తిరిగి ఆ పార్టీ మేనిఫెస్టో, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. చెయ్యి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అశోక్, ముత్యాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాగారం, రాంపల్లి నేతలు తదితరులు



కాచవానిసింగారంలో ప్రచారం చేస్తున్న వినోద్, రాజేశ్ తదితరులు

రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

కీసర: మల్కాజ్‌గిరిలో బీఆర్‌ఎస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్‌ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు. కీసరలోని వివిధ కాలనీల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓట్లు వేసి ఎంపీగా గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కోరారు. పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, సునీత, ఆనబోయిన జంగయ్యముదిరాజ్, గుర్రం శ్రీధర్, పూండ్రు మల్లేష్, మిట్టపల్లి రాజుగౌడ్, చినింగని బాల్‌రాజ్, ప్రవీణ్, ఆంజనేయులు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం

జవహర్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాగిడిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డిని గెలిపించాలని మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడిని గెలిపించాలని కోరారు.



కీసరలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదతరులు



జవహర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న మాజీ మేయర్ కావ్య



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, నాయకులు

మేడ్చల్ వరకు మెట్రో రైల్ తెస్తా

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మేడ్చల్: మల్కాజ్‌గిరి నుంచి బీజేపీ ఎంపీగా తనను గెలిపిస్తే మేడ్చల్ వరకు మెట్రో రైల్ తెస్తానని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన రోడ్ షో భాగంగా వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే మేడ్చల్ వరకు మెట్రో రైల్ వస్తుందని, ఈ ప్రాంతంలోని అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

రేవంత్‌రెడ్డిపై విసుర్లు..

సీఎం రేవంత్‌రెడ్డి తనపై అనవసరంగా విమర్శలు చేస్తున్నాడని, 14 ఏళ్లు తాను ఉద్యమంలో పోరాటం చేసిన నాడు రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కిపెట్టి సమైక్య పాలకుల వెంట నిలిచాడన్నారు. ఆయన ఎంపీగా ఏనాడైనా పార్లమెంట్‌లో మాట్లాడాడా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మంచి పనులు చేస్తాడని అనుకున్నా కానీ అన్ని బుడ్డర్‌ఖాన్ మాటలు మాట్లాడతాడని అనుకోలేదన్నారు. తాను ముగ్గురు ముఖ్యమంత్రులతో పోరాటం చేశానని, వీరంతా లెక్క కాదన్నారు.

పదవిని గడ్డిపోసలా విసిరాను..

మంత్రులను మనుషులుగా చూడని మాజీ సీఎం కేసీఆర్‌కు తన మంత్రి పదవి గడ్డిపోసలా విసిరిపారేసి ప్రజల పక్షాన నిలిచి ఆత్మాభిమానం కోసం పోరాటం చేశానన్నారు. ఎంపీగా గెలిస్తే మల్కాజ్‌గిరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు నందారెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, పోచయ్య, శైలజహరినాథ్, హేమలతారెడ్డి, ప్రేందాస్, రాఘవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



రోడ్ షోలో పాల్గొన్న జనం

భారతి సిమెంట్‌తో దృఢమైన భవనాలు



తాపీ మేస్త్రీలకు బహుమతులను అందజేస్తున్న సాత్వికరెడ్డి

పోచారం: భారతి సిమెంట్ వినియోగించి దృఢమైన భవనాలు నిర్మించవచ్చని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి అన్నారు. నారపల్లిలోని ఎంఆర్ ట్రేడర్స్ డీలర్ షాప్ వద్ద తాపీ మేస్త్రీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలను వేగవంతంగా నిర్మించవచ్చన్నారు. అంతేగాక, వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయాన్ని సంస్థ అందజేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్లో లభించే ఇతర కంపెనీల సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ రూ.20 అధికంగా ఉన్నప్పటికీ ఎక్కువ నాణ్యత ప్రమాణాలు కలిగి ఉందన్నారు. సమవేశంలో పాల్గొన్న 30 మంది మేస్త్రీలకు సాత్విక్‌రెడ్డి బహుమతులను అందజేశారు.